# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

11

మరునాడు ఉదయం ఆఫీస్‌కి బయలుదేరుతుండగా చేతిలో తాళం కప్పతో వచ్చింది సౌదామిని.

"అదేమిటి? నువ్వు కూడా ఎక్కడికైనా వెళుతున్నావా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"లేదు."

"మరయితే ఆ తాళం కప్ప దేనికి తెచ్చావు?"

"తాళం వేసుకుని వెళ్ళండి."

"సౌదామినీ! "

"అవును. నాకు ఇంట్లోంచి బైటికి వెళ్ళే అవసరంలేదు. నువ్వు తాళం వేసుకు వెళితే ఆ అవకాశం కూడా ఉండదు."

"దేనికీ తాళం వెయ్యడం?"

"మనమధ్య పొరపొచ్చాలకీ, అనుమానాలకీ తావు ఉండకూడదు. ఎవరైనా చాడీలు చెప్పి నిన్ను మార్చేయవచ్చు. నా మీద చాడీలు నమ్మటం చాలా తేలిక."

"ఛ. నువ్వు మంచిదానివయ్యావని పూర్తిగా విశ్వసిస్తున్నాను. నీ మీద నాకు అనుమానాలేవీ లేవు."

"ఈ విషయంలో నా మాట విను. ఇది ఇద్దరికీ మంచిది. ప్లీజ్."

"నిన్ను నమ్ముతాను సౌదామినీ! నా నమ్మకం పోయినప్పుడు అలాగే చేస్తాను. ఇపుడు మాత్రం కాదు. సరా?"

ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు పరాంకుశం. సౌదామిని సిన్సియారిటీకి అతనికి మనసంతా సంతోషంతో నిండిపోయింది.

✷✷✷

మొట్టమొదటిసారిగా ఆ రోజు పరాంకుశం తన భార్యని తన తోటి ఉద్యోగుల భార్యలకి పరిచయం చేసే అవకాశం లభించింది.

పరాంకుశం ఆఫీస్‌లో పనిచేసే ఒకతను రాజీనామా ఇచ్చి బెహరెన్‌లో ఓ ఉద్యోగం దొరికితే అక్కడికి వెళుతున్న సందర్భంలో పార్టీ ఏర్పాటు చేసాడు.

ఆ పార్టీకి పరాంకుశం ఆఫీస్‌లోని స్టాఫ్ అంతా తమ తమ కుటుంబాలతో హాజరయారు.

సౌదామినిని తోటి ఆడవాళ్ళు వింతగా, విస్మయంగా చూసారు. సౌదామిని అందరికీ తనను తాను పరిచయం చేసుకుంది.

"అయామ్ మిసెస్ పరాంకుశం." అని రెండు చేతులూ జోడించి ఆమె నమస్కరిస్తే ప్రతి నమస్కారం చేయటం కూడా మర్చిపోయారు ఒకరిద్దరు.

నెమలికంఠం రంగు పట్టుచీరలో, నిండుగా కప్పుకున్న పైటతో, నుదుట రాగిపైసంత కుంకుమ బొట్టుతో, ఏడునెలల గర్భంతో ఎంతో నిండుగా, హుందాగా ఉంది సౌదామిని. ఆడవాళ్ళతో చనువుగా మాట్లాడింది. ఒకరిద్దరు మొగవాళ్ళు ఏదో మాట్లాడితే సమాధానం చెప్పి మర్యాదగా పక్కకి తప్పుకుంది.

ఆఫీసర్ కాసేపు రాజీనామా చేసిన వ్యక్తి ఆఫీస్ పని మీద చూపించిన శ్రద్ధని పొగిడి, విదేశానికి వెళుతున్న అతనికి శుభం జరగాలని మాట్లాడాడు.

నలుగురైదుగురు అతని మంచితనం గురించి మాట్లాడారు. తర్వాత రిఫ్రెష్‌మెంట్స్ సర్వ్ చేసారు.

పరాంకుశం కొత్తల్లో తన గురించి పరోక్షంగా హేళనగా మాట్లాడినవాళ్ళను పక్కకి పిలిచి సౌదామినికి ప్రత్యేకంగా పరిచయం చేసాడు.

"ఇతను మా స్టోర్స్ క్లర్క్. ఈమె నా భార్య సౌదామిని.. అన్నట్లు సౌదామిని, అప్పుడు చెప్పానే నేను నిన్ను చేసుకుంటే నిన్ను అడ్డం పెట్టుకుని ఆఫీసర్ మెప్పు పొంది ప్రమోషన్స్ త్వరగా సంపాదించే అవకాశం నాకుందని ఒకతను అన్నాడని? ఆయనే ఇతను! స్టోర్ క్లర్క్."

"నమస్తే." మర్యాదగా నమస్కరించింది సౌదామిని రెండుచేతులు జోడించి. అతను ఆఫీసులో అందరికన్నా ఎక్కువగా పనిచేస్తాడు అని చెప్పి పరిచయం చేస్తే ఎంత మామూలుగా నమస్కరిస్తుందో అంత సాధారణంగా చూస్తూ మృదువుగా నవ్వింది సౌదామిని.

అతను ప్రతి నమస్కారం చేయడానికి కూడా తత్తరపడ్డాడు.

"నేనలా అనలేదు. ఐమీన్.." అతను ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"ఇట్సాల్ రైట్ ఒకానొకప్పుడు నేను వేశ్యగా బ్రతికాను కాబట్టి మనుషుల్లోని చాలా బలహీనతలు అర్థం చేసుకోగలను. ఇలాంటి మాటలు మాకిద్దరికీ అప్పట్లో అలవాటే."

"ఆనాడు అలా అన్నందుకు ఐయామ్ వెరీ సారీ మిస్టర్ పరాంకుశం." చెప్పాడు స్టోర్స్ క్లర్క్. అతని కంఠంలో పశ్చాత్తాపం, విచారం స్పష్టంగా ధ్వనించటం విన్నారు పరాంకుశం, సౌదామిని.

మొహం ఇబ్బందిగా పెట్టి దూరంగా వెళ్ళిపోయాడు అతను.

"ఇతను ఒకో కామెంట్ చేస్తుంటే గుండెల్లో సూదులు గుచ్చుకున్నట్లుండేది" చెప్పాడు పరాంకుశం బాధగా.

నలుగురయిదుగురిని ఆ విధంగా కావాలని పరిచయం చేసాడు సౌదామినికి. సౌదామిని ఆ పార్టీకి హాజరైన అందరినీ వీలు చూసుకుని ఒకసారి తమ ఇంటికి రావలసిందిగా ఆహ్వానించింది.

"మనమీద ఉన్న చెడ్డభావం పోవాలంటే వాళ్ళు మనింటికి వచ్చి వెళ్ళాలి. తప్పకుండా ఇంటికి తీసుకురా." చెప్పింది సౌదామిని భర్తతో.

పార్టీ అయ్యాక బయటికి వచ్చారంతా. అంతమందిని చూసి రిక్షావాళ్ళు రేటు పెంచేసారు. బేరం చేస్తున్నాడు పరాంకుశం.

"రూపాయి పావలా ఇవ్వండి." చెప్పాడు రిక్షావాడు.

"ఇందాక రూపాయే ఇచ్చి వచ్చాం."

"గిట్టదండి."

దూరంగా నిలబడి పరాంకుశం, రిక్షావాడి మాటలు వింటున్న ఒకతను రిక్షావాడి దగ్గరికి వచ్చి గట్టిగా గదమాయిస్తూ అన్నాడు.

"రూపాయికి కట్టవా రిక్షా?"

రిక్షావాడు వాడివంక చూసి మారుమాట్లాడలేదు.

"వెళ్ళండి సార్! రూపాయికే వస్తాడు. వెళ్ళండమ్మగారూ." చెప్పాడతను.

ఇద్దరూ రిక్షా ఎక్కి కూర్చున్నారు. అతను ఇద్దరికీ నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

"ఎవరతను?" ఆలోచనగా అడిగాడు పరాంకుశం.

"ఈ ఊళ్ళో పెద్ద రౌడీ సార్." చెప్పాడు రిక్షా లాగేవాడు.

"గుర్తుపట్టలేదా నువ్వు?" అడిగింది సౌదామిని భర్తని.

"లేదు. ఎవరు?"

"మన పెళ్ళిరోజు ఇలాగే పార్టీ అయ్యాక రిక్షాలో ఇంటికి వెళుతుంటే ఒక రౌడీ రిక్షా ఆపి గొడవ చేసాడు. గుర్తుందా నీకు?"

"అవును. పోలీస్ స్టేషన్‌కి కూడా వెళ్ళాం ఆ రోజు."

"అతనే ఇతను." చెప్పింది సౌదామిని.

"ఏ సంఘం మనల్ని అగౌరవంగా చూసిందో అదే సంఘం ఇప్పుడు మనల్ని గౌరవంగా చూస్తోంది." చెప్పాడు పరాంకుశం తృప్తిగా.

* * *

రెండు సంవత్సరాలు దాటుతున్నాయి పరాంకుశం పెళ్ళి అయి. సౌదామినిని చూస్తే ఒకప్పుడు వేశ్య అని చెప్పినా ఇప్పుడు ఎవరూ నమ్మలేరు. ఇల్లాలికుండే అణకువ, విధేయత కనబడతాయి ఆ కళ్ళలో. పొగరుమోతుతనం పూర్తిగా నిష్క్రమించింది.

రెండు సంవత్సరాల తర్వాత వారు ఇప్పుడు ఇద్దరు కాదు, ముగ్గురు. పరాంకుశానికి కూతురు పుట్టింది. సౌదామిని ప్రైవేట్‌గా కట్టి మెట్రిక్ పాసయింది. ఎంబ్రాయిడరీ గొప్ప అభిరుచి. ఆ ఊళ్ళో అప్పుడప్పుడు జరిగే ఎంబ్రాయిడరీ పోటీల్లో, క్రాస్ స్టిచ్ పోటీల్లో బహుమతులు కూడా వస్తుంటాయి.

పాప పుట్టిన నెలరోజులకి, పరాంకుశం మామయ్యకి అనారోగ్యం అని టెలిగ్రాం వచ్చింది. దంపతులిద్దరూ వెళ్ళారు మామయ్యని చూడటానికి. గొంతు కేన్సర్. మూడు నెలలు మించి బ్రతకడని డాక్టర్ చెప్పాడు. సౌదామిని పిల్లలు లేని ఆ దంపతులని తన ఇంటికి తీసుకు వచ్చింది. ఆ ముసలాయనకి ఆఖరి రోజుల్లో సేవ చేసింది.

అంతదాకా పరాంకుశం ఇంటికి రాని బంధువులు ఒకొక్కరు ఆ ముసలాయన్ని చూడటానికి రాసాగారు. మొట్టమొదట అంతా సౌదామినిని వెలివేసినట్లుగా చూసారు కాని, సౌదామిని కలివిడితనం, మంచితనం, మాటతీరు చూసి కలిసిపోయారు.

"ఏమిటో అనుకున్నాను. పరాంకుశం పెళ్ళాం బంగారం. ఈ జబ్బు రాకపోతే నాకది తెలిసేది కాదుకదా. ఇది రావడం అందుకు మంచికే అయింది." రోజుకో సారైనా ఆయన బంధువులతో చెప్పేవాడు. రెండున్నర నెలల తర్వాత ఓ రోజు ఆ ముసలాయనని పాడెమీద తీసుకువెళుతుంటే సౌదామిని కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి.

"నీ దగ్గర కొద్దివారాలు ఉండి వెళతాను సౌదామిని." అడిగింది అత్తయ్య పదమూడో రోజు.

"ఆయన నాకు చెప్పారు. తప్పకుండా ఉండండి. కొద్దివారాలేం ఖర్మ. శాశ్వతంగా ఇక్కడే ఉండండి. మీరు పెంచి పెద్ద చేసిన ఋణాన్ని ఆయన తీర్చుకోనివ్వండి." ఆవిడతో చెప్పింది సౌదామిని.

"ఇప్పుడు కాదు. నా చివరిరోజుల్లో."

చెప్పిందావిడ.

"మొత్తానికి సాధించావోయ్" అన్నారు బంధువులంతా. ఎగ్జిబిషన్‌లో బొమ్మని చూసినట్లు చూసారు సౌదామిని. కొందరు రహస్యంగా తరచి తరచి ఇంటర్వ్యూ చేసారు ఆమెని. నవ్వుకుంది సౌదామిని.

బంధువుల తాకిడి తగ్గాక ఓ రోజు సౌదామిని పరాంకుశంతో చెప్పింది.

"నీకో సంగతి చెప్పాలి."

"ఏమిటి?"

"మీ అత్తయ్య చెల్లెలి కొడుకుని చూసారా?"

"ఎన్నోవాడు?"

"పెద్దవాడు."

"వాడా? ఏం?"

"మంచివాడు కాదు."

"ఏం చేశాడు?"

"ఏమయినా చేస్తే ఊరుకుంటానా?"

"ఏం అన్నాడు?"

కొన్ని క్షణాల తరువాత కోపం నిండిన కంఠంతో చెప్పింది.

"డబ్బిస్తానన్నాడు. చెయ్యి పట్టుకున్నాడు."

"ఓరి వీడిని తగలెయ్య. ఎప్పుడు? నాతో చెప్పద్దా? అక్కడే పాతిపెట్టి ఉండేవాణ్ణి."

పకపక నవ్వింది.

"బంధువుల ముందు గొడవ చేస్తారనే చెప్పలేదు. తనతో వచ్చేయమన్నాడు. ఉంచుకుంటాడట."

పళ్ళు పటపట కొరికాడు పరాంకుశం.

"మగాళ్ళంతా ఇంతే. ఆడది కనబడితే వెర్రెత్తిపోతారు. మగదక్షత లేని ఆడది వాళ్ళకి అలుసు. కొంచెం చెడ్డపేరు వస్తే చాలు దానివెనక పడతారు నిజంగా చెడ్డదేనని. అలాంటిది నా లాంటి దాని సంగతి చెప్పాలా?"

పరాంకుశం కోపంతో మండిపడిపోతూ ఉండిపోయాడు.

"బెర్నార్డ్ షా ఏం అన్నాడో తెలుసా?"

ఏమీటన్నట్లుగా చూసాడు పరాంకుశం.

"మారేజ్ ఈజ్ ఏన్ ఆథరైజ్డ్ ప్రాస్టిట్యూషన్."

"సౌదామినీ! ఎందుకు ఒప్పుకోలేదు నువ్వు?" హఠాత్తుగా అడిగాడు పరాంకుశం.

పరాంకుశం కళ్ళలోకి నమ్మలేనట్లుగా చూసింది సౌదామిని.

"చెప్పు, నీకు ఏం అడ్డం వచ్చింది?"

"ఎన్నోసార్లు అడిగావు? ఎన్నిసార్లు చెప్పాను. నన్ను చేసుకుని ఈ స్థితికి తెచ్చినందుకు కృతజ్ఞతవల్ల. నాకు ఇప్పటికీ 'శీలం' అంటే గురికుదరలేదు కాని, నీకోసం ఆ పని పాడు పని అంటావే - అది ఛస్తే చెయ్యను. నువ్వు ఎంతో మంచివాడివి. లేకపోతే పన్నెండువేల కట్నం వదులుకుని బంధువులని అందరినీ వదులుకుని నన్ను దేనికి చేసుకున్నావు?"

ఆమె చెప్పేది వింటున్నాడు పరాంకుశం.

"నువ్వు నా నుంచి గాఢంగా ఆశించేది 'శీలం'. నేను కోరనివి, నాకు కావలసినవి నువ్వు అనేకం ఇచ్చినప్పుడు నువ్వు కోరేది, నాకు అనవసరం అయింది నీకు ఇవ్వడంలో తృప్తి ఉంది నాకు, అంతే. ఎప్పటికీ, ఎవరికీ లొంగను. కొత్తలో ఏం అనుకునేదాన్నో తెలుసా? ఎలాగయినా నీకు తెలియకుండా డబ్బు సంపాదించి పెద్ద పెద్ద కార్లలో నిన్ను తిప్పాలనుకునేదాన్ని, నా వెర్రి అప్పట్లో."

"ఐ లవ్ యు" చెప్పాడు పరాంకుశం, సౌదామిని చేతిని ముద్దు పెట్టుకుంటూ.

ఒకరోజు పాపతో ఆడుకుంటుండగా చెప్పాడు పరాంకుశం, వెంటనే సౌదామినితో.

"సాయంత్రం ఒకచోటికి తీసుకువెళతాను, వస్తావా?"

"ఎక్కడికి? ఏదయినా ప్రోగ్రామ్ ఉందా?"

"ఇప్పుడేం చెప్పను. సర్‌ప్రైజ్."

సాయంత్రం పాపతో రిక్షాలో బయలుదేరారు దంపతులిద్దరూ.

"ఇక్కడికా?" అన్నది సౌదామిని, రిక్షా ఆ సందులోకి తిరుగుతుంటే, కంగారుగా.

"అవును."

"నాతో చెప్పకుండా ఇక్కడికి ఎందుకు తీసుకు వచ్చావు?"

"ఊరికినే. ఈ ఊరు వదిలి వెళ్ళిపోతున్నాంగా?"

"ఎప్పుడు?"

"నాకు ట్రాన్స్‌ఫర్ అయింది."

రిక్షా సందు మొదట్లో ఆగింది. రిక్షా దిగుతూ చెప్పాడు పరాంకుశం.

"మీ ఇంటిదాకా నడుద్దాం."

"మా ఇల్లు ఇక్కడలేదు." ముఖం చిట్లించి చెప్పింది.

రిక్షావాడిని అక్కడే ఉండమని చెప్పి ఆ సందులోకి నడిచారు. సంప్రదాయం గల అమ్మాయిలాగా ఉన్న సౌదామినిని ఎవరూ గుర్తుపట్టలేదు. ఆశ్చర్యంగా ఆమె వంక తేరిపార చూస్తున్నారు. ఆ సందులో అలాంటి సంసార స్త్రీకి ఏం పనా అని.

"ఎలా వున్నారు?" అడిగాడు పరాంకుశం భార్యని సందుకి రెండువైపులా నిలబడి, అశ్లీల పదజాలంతో పిలుస్తున్న అమ్మాయిల్ని చూసి.

ఇద్దరూ సౌదామిని ఇదివరకు ఉన్న ఇంట్లోకి వెళ్ళారు. కుంటివాడు లేడు ఇప్పుడు మరొకడున్నాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు ఆశ్చర్యంగా లేచినిలబడి.

"ఎవరూ అక్కర్లేదు. ఒకసారి చూసి వెళతాం."

"ఎవరు మీరు?" కర్కశంగా అడిగాడు.

"సౌదామిని." చెప్పాడు పరాంకుశం, వెంటనే సౌదామిని చెయ్యి పట్టుకుని లోపలికి నడిచాడు. అతను కరెంట్ షాక్ తిన్నవాడిలా వాళ్ళిద్దరి వంకా చూశాడు.

సౌదామిని!

అదే మంచం, అదే పరుపు. ఇదివరకు సౌదామిని ఉన్న గదిముందు ఆగి లోపలికి తొంగి చూసాడు. ఆ మంచం మీద ఒక పదిహేడేళ్ళ యువతి కూర్చుని సిగరెట్ తాగుతోంది.

సౌదామిని అలాగే చూస్తుండిపోయింది. తనకి అయిదేళ్ళు పైగా పరిచయం ఉన్న గది అది. ఈ మూడేళ్ళ బ్రేక్ తర్వాత కొత్తగా, వింతగా, అసహ్యంగా కనిపిస్తోంది ఇప్పుడది.

పరాంకుశం జేబులోంచి ఒక ఫోటో తీసి సౌదామిని కళ్ళముందుంచాడు.

సౌదామిని మూడేళ్ళ క్రితం ఫోటో అది. ఆ గదిలో పరాంకుశం తీసిందది.

"పోదాం పద." చెప్పింది బాధగా.

బయటికి వచ్చారు ఇద్దరూ. సౌదామిని వచ్చిందన్న సంగతి తెలిసి చాలామంది పాత పరిచయస్తులు బయట గుమిగూడారు. ఆశ్చర్యంగా, వింతగా, నమ్మలేనట్లుగా చూస్తున్నారు సౌదామిని వంక, చంకలో పాపవంక.

"ఇదివరకు ఆ పక్కగదిలో ఉండేది. ఆమె ఏది?" అడిగింది సౌదామిని వాళ్ళలో ఒకరిని.

"ఎవరు? జానకా? హాస్పిటల్లో ఉంది." చెప్పారు ఎవరో.

"దేనికి?"

"కుష్టు"

"అయ్యో!"

అంతా సౌదామిని వంక ఈర్ష్యగా చూస్తున్నారు.

రిక్షాలో వెళుతుంటే చెప్పాడు పరాంకుశం.

"చూసావుగా ఎంతమంది ఆదుకోవాల్సిన ఆడవాళ్ళు అక్కడ ఉన్నారో? నాకున్నది ఒక్కటే జీవితం."

"నన్ను ఎంచుకున్నందుకు ఐ యామ్ ఆల్వేస్ గ్రేట్‌ఫుల్ టు యు. లేకపోతే నేనూ హాస్పిటల్ లో ఉండేదాన్నేమో?"

"గాడ్ ఈజ్ గ్రేట్. నిన్ను కాక ఇంకొర్ని ఎంచుకుంటే వాళ్ళు నీలా మారేవారో లేదో? ఐ యామ్ ఆల్వేస్ గ్రేట్ ఫుల్ టు యు." జవాబు చెప్పాడు పరాంకుశం.

"వాళ్ళు నన్ను అక్కడే నిర్బంధిస్తే ఏం చేసేవారు? ఎందుకు అంత ధైర్యంగా తీసుకువెళ్ళారు?" అడిగింది.

"నిర్బంధించరని తెలిసే తీసుకెళ్ళాను." చెప్పాడు.

ఆ కుంటివాడు రోజూ ఆఫీస్‌కి వచ్చి తను సౌదామిని కొనడానికి వెచ్చించిన అయిదువేలు నష్టపోయానని కొంతైనా ఇవ్వమని బ్రతిమాలేవాడు. వాడి పోరు పడలేక ప్రావిడెంట్ ఫండ్‌లోంచి వెయ్యి రూపాయలు అడ్వాన్సు తీసుకుని అతనికి ఇచ్చాడు పరాంకుశం, కాని ఆ సంగతి అతను సౌదామినికి చెప్పలేదు.

ఏ మగాడూ తన పెళ్ళాన్ని డబ్బిచ్చి కొనుక్కున్నానని చెప్పుకోడు.

ముఖ్యంగా పెళ్ళాంతో.

✷✷✷

ఇప్పుడు సౌదామిని సంఘంలో చాలా గౌరవమయిన స్థానం సంపాదించుకుంది. తనున్న కొత్త ఊరిలోని సందులోని వాళ్ళకి సౌదామిని గతం గురించి తెలిసినా, సత్యనారాయణ వ్రతంలాంటి పవిత్ర కార్యాలకి, పుట్టినరోజు పేరంటంలాంటి మామూలు వాటికి, అన్నిటికీ సౌదామినిని ఇంటికి వచ్చి బొట్టుపెట్టి పిలుస్తున్నారు. సౌదామినితో అయిదారు నిమిషాలు మాట్లాడితే చాలు. ఇదివరకు ఉన్న దురభిప్రాయం వెంటనే మాయమవుతుంది. కలుపుగోలు మనిషి కాబట్టి సౌదామినికి ఒక ప్రత్యేకస్థానం ఉంది ఆ వీధిలో.

కొన్ని సంవత్సరాల క్రితం ఆమె దగ్గరికి విటుడిగా వచ్చినవాళ్ళు ఎప్పుడయినా సౌదామినికి ఎదురుపడితే వాళ్ళు సిగ్గుతో తలవంచుకుని వెళ్ళిపోయే సందర్భాలే ఎక్కువ.

పరాంకుశం ప్రయివేట్‌గా కంపెనీ సెక్రటేరియట్ కోర్స్ పరీక్షలు రాసి పాసయ్యాడు. ఒక ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో అతనికి నాలుగేళ్ళ తర్వాత ఎక్కువ జీతంతో ఇంకో ఉద్యోగం వచ్చింది.

"కొన్ని సంవత్సరాల్లో ఈ ఊళ్ళో అంతా మన సంగతి మరచిపోతారు. కొత్త ఊళ్ళో మన గురించి ఎవరికీ తెలియదు. 'అదిగో. ఆమె సౌదామిని' అని వేలెత్తి చూపించని చోటికి, మనకి ఇంకో కొత్త ఊరుకి బదిలీ అయితే బావుణ్ణు అని చాలాకాలం నుంచి అనుకుంటున్నాను." చెప్పింది సౌదామిని కొత్త ఊరికి వెళ్ళడానికి రైల్వేస్టేషన్‌లో రిక్షాదిగాక.

"ఇక్కడ మీమీద ఇప్పుడు ఎవరికీ చెడ్డ అభిప్రాయంలేదు. మీరు మంచిగానే గుర్తుండిపోతారు కానీ, చెడ్డగా కాదుగా?" చెప్పాడు శ్రీకంఠం. అతను సెండాఫ్ ఇచ్చేందుకు స్టేషన్‌కి భార్యతో వచ్చాడు.

సరిగ్గా అదే సమయంలో ఎవరో రిక్షా బేరం ఆడుతూ రిక్షా అతనికి గుర్తుకోసం' సౌదామిని ఇంటి సందుకి నాలుగో సందు' అని చెపుతున్నాడు గట్టిగా.

చిన్నగా నవ్వింది సౌదామిని.

"ఫర్వాలేదు. అంత త్వరగా మర్చిపోలేరు ఇక్కడి ప్రజలు నన్ను." చెప్పింది.

కొత్త ఉద్యోగంతో పాటు వాళ్ళ జీవితాల్లోకి మరో ప్రాణి కూడా ప్రవేశించింది.

పరాంకుశానికి మళ్ళీ కూతురు పుట్టింది.

మొదటి కాన్పుకి వచ్చినట్లుగానే, పరాంకుశం అక్కయ్య సహాయానికి వచ్చింది.

పెద్దదానికన్నా ఇది అందంగా ఉంది. నాకు పిల్లలు లేరు కదా. దీన్ని నాకు పెంపకానికి ఇస్తారా?" నవ్వుతూ అడిగింది.

"మీరు మా కుటుంబానికి చేసిన సహాయానికి పదిమంది పిల్లలని ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేం. నిరభ్యంతరంగా తీసుకోండి." చెప్పింది సౌదామిని.

"ఊరికే అడిగాను కాని మావారు ఇందుకు ఒప్పుకోరు."

"అడిగి చూడండి. ఇవాళే ఉత్తరం రాయండి" కోరింది సౌదామిని.

ఉత్తరం రాస్తే 'ఒద్దు నీకేమైనా పిచ్చా?' అని ఆయన నుంచి తిరుగుటపాలో జవాబు వచ్చింది.

"ఈసారి కొడుకును కనలేదే?"

కానుపైన మర్నాడు పరాంకుశం భార్యని అడిగాడు నవ్వుతూ.

"నీ ఇష్టమేనేంటి?"

"నీ ఇష్టమా లేకపోతే? ఈసారి కొడుకు కావాలి నాకు."

"ఊహూ. ఇంతటితో స్టాప్."

"చిత్తం."

పరాంకుశానికి మళ్ళీ ఇంకో ఊరు బదిలీ అయింది. కొత్త ఊరిలో ఆమె గతం ఊసే ఎవరికీ తెలీదు.

పరాంకుశానికి అనుకోకుండా రైల్లో అమ్మాజీ తారసపడింది. ఆమెని వెంటనే గుర్తుపట్టలేకపోయాడు పరాంకుశం.

"చాలా మారిపొయ్యావ్. లావయ్యావు కూడా." చెప్పాడు పరాంకుశం ఆమె పలకరించి తనని గుర్తుచేయగానే.

"నువ్వు... మీరు కూడా. జుట్టు నెరుస్తోంది అప్పుడే"

"ఇద్దరు బిడ్డల తండ్రిని. ఇంకా మీ ఇంట్లో గదిలో అద్దెకి ఉండేకుర్రాడినేంటి?"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"కొడుకా? " అడిగాడు అమ్మాజీ ఒళ్ళో పిల్లవాడిని చూసి.

"అవును."

"ఏం చేస్తున్నావు?"

"పెళ్ళయింది. కాపురం చేస్తున్నాను."

"అతను..? అతనేనా?"

"ఉహూఁ."

పరాంకుశం కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"మీ శ్రీకంఠం ఎలా ఉన్నాడు?"

"ఇందాకే మాకు సెండాఫ్ ఇవ్వడానికి స్టేషన్‌కి వచ్చాడు. అన్నట్లు నాకు కడపకి బదిలీ అయింది. మా ఆవిడ అక్కడ కూర్చుంది. రా. చూద్దువుగాని."

సౌదామిని గుర్తుపట్టలేదు అమ్మాజీని. అమ్మాజీ ఎక్కువ సేపు కూర్చోలేదు. కడప దాకా రావటంలేదు. మధ్యలో దిగిపోతుంది. చిరునామా ఇచ్చింది ఎప్పుడయినా రమ్మని.

"మీ అబ్బాయి అచ్చం మీ పోలికే. తల్లి పోలిక వచ్చిన కొడుకు అదృష్టవంతుడంటారు." చెప్పింది సౌదామిని బాబుని ముద్దు పెట్టుకుని.

తాడిపత్రిలో దిగిపోయింది అమ్మాజీ.

✷✷✷

ఆరోగ్యం బాగాలేని పరాంకుశం అత్తయ్య కొంతకాలానికి వచ్చి పరాంకుశం దగ్గరే ఉంది. ఆవిడ ఎక్కువ కాలం లేదు. ఓ రోజు నిద్రలో ప్రశాంతంగా మరణించింది. కర్మకాండకి పరాంకుశం అక్క, బావ వచ్చారు. ఆ విధంగా పరాంకుశం తనని పెంచిన ఇద్దరి ఋణాన్ని తీర్చుకున్నాడు.

✷✷✷

*(తరువాయి భాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library